
# సాక్షి
## జయశంకర్ భూపాలపల్లి

గురువారం | 6 | ఏప్రిల్ | 2023



### ప్రభుత్వం మారితేనే భూమి, ఇల్లు

దేశంలో ప్రభుత్వం మారితేనే పేదలకు భూమి, ఇళ్లు వస్తాయని, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బీజేపీని సాగనంపడానికి పోరాడుదామని సీపీఐ పార్లమెంటరీ నాయకుడు బినోయ్ విశ్వం పిలుపునిచ్చారు. - 8లో



### ఎంపీపీ కుటుంబానికి చేయూత

కురవి ఎంపీపీ పద్మావతిరవినాయక్ కుటుంబానికి మానుకోట ఎంపీ కవిత, డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్‌లు రూ.2లక్షల ఆర్థికసాయాన్ని అందజేసి ఔదార్యం చాటుకున్నారు. - 8లో

### వాతావరణం

గరిష్టం/కనిష్టం $37.0^0/24.0^0$

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది.

### రంజాన్ వేళలు

| ఇఫ్తార్ | సహర్ |
|---|---|
| గురు 6:36 | శుక్ర 4:43 |

## న్యూస్‌రీల్

### సింగరేణి చెక్‌పోస్టు ప్రారంభం



భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి ఏరియాలోని కేటీకే ఓపెన్ కాస్టు ప్రాజెక్ట్-2లో నూతనంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు బుధవారం ప్రారంభించారు. అనంతరం గత నెల 31వ తేదీన ఓసీపీ నుంచి అత్యధికంగా బొగ్గు ఉత్పత్తి చేసి రవాణా చేసిన సందర్భంగా ఉద్యోగులను అభినందించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారి వెంకటరామరెడ్డి, అధికారులు యాదయ్య, భిక్షమయ్య, నజీర్, సమ్మిరెడ్డి, శ్రీనివాసరావు, మోహన్, శంకర్‌రావు, రాజశేఖర్, ప్రశాంత్, యూనియన్ నాయకులు సమ్మయ్య, రమేష్, కరీముల్లాలు పాల్గొన్నారు.

### పల్లె దవాఖానా సందర్శన



కాటారం: మండల పరిధిలోని ధన్నాడ పల్లె దవాఖానాను బుధవారం జాతీయ నాణ్యత ప్రమాణాల బృందం పరిశీలించింది. డాక్టర్ లింకస్ ప్రియదర్శిచౌదరి, డాక్టర్ సునందతో కూడిన బృందం సభ్యులు ఆస్పత్రికి రాగా వైద్యులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం బృందం సభ్యులు ఆస్పత్రి ఆవరణ, రికార్డులు, ఓపీ సేవలు, జాతీయ ఆరోగ్య సేవలు అమలు విధానంపై ఆరా తీశారు. సౌకర్యాలు పరిశీలించి పలు వివరాలను వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. బృందం సభ్యుల వెంట జిల్లా వైద్యాధికారి శ్రీరామ్, ప్రోగ్రాం అధికారులు శ్రీదేవి, ఉమాదేవి, డీపీఓ చిరంజీవి, క్వాలిటీ మేనేజర్ భానుకుమార్, మండల వైద్యాధికారి మౌనిక, వైద్య సిబ్బంది ఉన్నారు.

### క్రీడలతోనే స్నేహభావం



చిట్యాల: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని ఎంపీపీ వినోద అన్నారు. మండల కేంద్రంలోని క్రికెట్ ప్రీమియర్ లీగ్ క్రీడోత్సవాలను జెడ్పీటీసీలు గొర్రె సాగర్, పులి తిరుపతిరెడ్డిలతో కలిసి ఎంపీపీ క్రీడోత్సవాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామీణ క్రీడలకు పెద్దపీట వేస్తుందన్నారు. ఆ దశలోనే ప్రతీ గ్రామానికి క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేశామన్నారు. క్రికెట్ క్రీడోత్సవాలను క్రీడాకారులు స్నేహపూర్వక వాతావరణంలో జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ దబ్బెట అనిల్, కో ఆప్షన్ సభ్యులు ఎండి రాజ్ మహ్మద్, సర్పంచ్‌లు పూర్ణచందర్‌రావు, పోశాలు, నాయకులు చింతల సుమన్, క్రీడా కమిటీ అధ్యక్షుడు మహేందర్, సభ్యులు రాజ్‌కుమార్, లవన్ బాబు పాల్గొన్నారు.

### గిరిజన గ్రామాల్లో పర్యటన

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని పలు మారుమూల గ్రామాల్లో ట్రాన్స్ కో డీఈ పులుసం నాగేశ్వర్‌రావు బుధవారం పర్యటించారు. లింగాల, బంగాల గ్రామ పంచాయతీల పరిధిలో చేపట్టిన విద్యుత్ పనులను ఆయన పరిశీలించారు. విద్యుత్ పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని సూచించారు. విద్యుత్ సమస్యలు తలెత్తితే వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. అనంతరం గంగారం మండలంలోని రామారావు గ్రామాన్ని సందర్శించగా సింగిల్, త్రీఫేస్ విద్యుత్ సమస్యలను గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఆయన వెంట లింగాల సర్పంచ్ మౌనిక, లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, గ్రామస్తులు ఉన్నారు.

# బండిని మారుస్తూ.. శ్రేణులను ఏమారుస్తూ..

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ని కోర్టులో హాజరుపరిచేంత వరకు హైడ్రామా


## లింగాలఘణపురం, పాలకుర్తి, జఫర్‌గఢ్, ఐనవోలు మండలాల మీదుగా తరలింపు

- పెంబర్తి వద్ద అడ్డుకున్న కార్యకర్తలు.. పోలీసుల లాఠీచార్జ్
- హనుమకొండ కోర్టుకు చేరేంత వరకు క్షణక్షణం ఉద్రిక్తత
- సాయంత్రం 6 గంటలకు జడ్జి ఎదుట హాజరు
- బండి సంజయ్ సహా నలుగురికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్
- బీజేపీ, బీఆర్‌ఎస్ శ్రేణుల మోహరింపుతో టెన్షన్ వాతావరణం



పెంబర్తి వద్ద సంజయ్‌ను మరో వాహనంలోకి మారుస్తున్న పోలీసులు

సాక్షిప్రతినిధి,వరంగల్/లింగాలఘణపురం/పాలకుర్తి/జఫర్‌గఢ్/స్టేషన్‌ఘన్‌పూర్: పదో తరగతి హిందీ పరీక్ష పేపర్ లీక్, కాపీయింగ్ కుట్ర కేసులో ఏ1గా ఉన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ని నాటకీయ పరిణామాల మధ్య బుధవారం హనుమకొండ కోర్టుకు తరలించారు. మంగళవారం రాత్రి కరీంనగర్‌లో అక్కడి పోలీసులు ఆయనను అరెస్టు చేయగా, బీజేపీ శ్రేణులు ఆందోళనకు సిద్ధం కావడంతో ఆయనను బుధవారం తెల్లవారుజామున వరంగల్ కోర్టులో హాజరుపర్చేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్కడా బీజేపీ, బీఆర్‌ఎస్ శ్రేణులకు ఉప్పంది పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ప్లాన్ మార్చారు. జనగామ, స్టేషన్ ఘన్‌పూర్‌ల ద్వారా వరంగల్ తరలించాలని భావించినా.. ఓ వైపు వ్యతిరేకంగా బీఆర్‌ఎస్, మరోవైపు అనుకూలంగా బీజేపీ శ్రేణులు రోడ్డెక్కడంతో పాలకుర్తి మీదుగా దారులు మారుస్తూ.. జఫర్‌గఢ్, రఘునాథపల్లిమీదుగా మడికొండ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌కు తరలించారు.




**11:12 గంటలకు:** బొమ్మలరామారం నుంచి పెంబర్తి కమాన్ వరకు తీసుకొచ్చారు. కమాన్ వద్ద డీసీపీ సీతారాం, ఏసీపీ దేవేందర్, సీఐ నాగబాబు ఆధ్వర్యంలో బండి సంజయ్‌ని మరో పోలీసు వాహనంలో నిమిషం వ్యవధిలోనే ఎక్కించారు. 11.15 గంటల వరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు దశమంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పెంబర్తికి చేరుకొని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మహిపాల్, కార్యకర్తలు పోలీస్ ఎస్కార్ట్ వాహనానికి అడ్డంగా పడుకున్నారు. రోడ్డుపై టైర్లు దహనం చేశారు. పోలీసులు వారిపై లాఠీచార్జ్ చేసి చెదరగొట్టారు.

**11.20 గంటలకు** పోలీస్ కాన్వాయ్ పెంబర్తి సర్వీస్ రోడ్డు మీదుగా వరంగల్ వైపు కాకుండా నెల్లుట్ల బైపాస్ వరకు చేరుకుంది. లింగాలఘణపురం పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తారని బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున ఇక్కడికి చేరుకున్నాయి.

**12.00 గంటలకు** లింగాలఘనపురం స్టేషన్‌కు కాకుండా నెల్లుట్ల, కుందారం, చీటూరు, కోలుకొండ మీదుగా పాలకుర్తి పోలీస్‌స్టేషన్ తీసుకెళ్లారు. బండి సంజయ్‌ని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి వైద్యపరీక్షలు నిర్వహించారు.

**12:10 గంటలకు:** పాలకుర్తి నుంచి దర్దేపల్లి, కొండపూర్ మీదుగా జఫర్‌గఢ్ మండలంలోకి ప్రవేశించారు. మంగ్లుంతండా మీదుగా ఒబులాపూర్, నల్లబండ క్రాస్ వద్ద వర్ధన్నపేట వైపునకు కొన్ని పోలీసు ఎస్కార్ట్ వాహనాలను మళ్లించారు.

**12:50 గంటలకు:** బండి సంజయ్‌ను మాత్రం జఫర్‌గఢ్ మండల కేంద్రం మీదుగా కోనాచలం, కూనూరు, రఘునాథపల్లినుంచి మల్లక్‌పల్లి, కరుణాపురం నుంచి మడికొండ పీటీసీకి తరలించారు.

**2.30 - 3.45 గంటలకు :** మడికొండ పీటీసీలో సుమారు గంటపాటు గడిపిన పోలీసులు సంజయ్‌ను కోర్టులో హాజరు పర్చేందుకు బయలుదేరారు. సమాచారం బయటకు పొక్కడంతో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో రోడ్లపైకి చేరి నినాదాలు చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. మడికొండ పీటీసీ నుంచి కాజీపేట ద్వారా హనుమకొండ కోర్టుకు తరలిస్తున్న క్రమంలో కాజీపేట సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు సంజయ్‌ను తరలిస్తున్న కాన్వాయిపై చెప్పులు, కోడిగుడ్లు విసిరారు.



సంజయ్ ఉన్న వాహనంపై బీఆర్‌ఎస్ శ్రేణుల చెప్పల దాడి

**4.13 గంటలకు :** సుమారు 13 పోలీస్ వాహనాల కాన్వాయ్.. హనుమకొండ కోర్టు ఆవరణకు చేరగా, ఆయనతో పాటు మరో ముగ్గురు నిందితుల రిమాండ్ ప్రక్రియ నిర్వహించారు.

**5.05 గంటలకు :** కోర్టుకు సమీపంలో ఉన్న జడ్జి నివాసానికి వెళ్లిన పోలీసులు రిమాండ్ రిపోర్టును ఆమె ఎదుట ఉంచారు.



జడ్జి వద్దకు బండి సంజయ్‌ని తీసుకెళ్తున్న పోలీసులు

**6.03 గంటలకు :** న్యాయమూర్తి రాపోలు అనిత ఆదేశాల మేరకు బండి సంజయ్‌తో పాటు మరో ముగ్గురు నిందితులు బూర ప్రశాంత్, గుండెబోయిన మహేష్, మౌటం శివగణేష్‌లను ఆమె ఎదుట హాజరుపర్చగా రిమాండ్ ప్రక్రియ ప్రారంభమైంది. సుమారు 2.45 గంటల పాటు వాదోపవాదాలు సాగాయి.

**రాత్రి 9 గంటలకు :** జడ్జి.. నిందితులకు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించడంతో బీజేపీ కార్యకర్తలు, నాయకుల నినాదాల మధ్య భారీ బందోబస్తుతో బండి సంజయ్‌ను కరీంనగర్ జైలుకు తరలించారు.



కరీంనగర్ జైలుకు తరలించే ముందు అభివాదం చేస్తున్న బండి



పెంబర్తి వద్ద పోలీస్ ఎస్కార్ట్ వాహనాన్ని అడ్డుకున్న బీజేవైఎం శ్రేణులు

## బీజేపీ నాయకుల అరెస్టు

### అరెస్ట్‌ను నిరసిస్తూ ధర్నా, ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

హన్మకొండ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ని హనుమకొండ జిల్లా కోర్టులో ప్రవేశ పెట్టేందుకు తీసుకువస్తున్నారని సమాచారంతో బుధవారం మధ్యాహ్నం ఆ పార్టీ శ్రేణులు కోర్టు వద్దకు చేరుకున్నాయి. తమ రాష్ట్ర అధినేతను అక్రమ అరెస్టు చేశారని నిరసిస్తూ హనుమకొండలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద బీజేపీ నాయకులు, కార్యకర్తలు ధర్నా చేశారు. ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమాన్ని హనుమకొండ ఏసీపీ కిరణ్, పోలీసులు అడ్డుకున్నారు. కాలుతున్న దిష్టిబొమ్మను లాక్కునే ప్రయత్నం చేశారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నాయకులు, కార్యకర్తలు వెళ్లాలని పోలీసులు హెచ్చరించినా వారు నిరసన కొనసాగించడంతో మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, బీజేపీ నాయకులు రావుల సుదర్శన్, అమర్నాథ్‌రెడ్డి, హరీష్, బాబురావు, మారపల్లి విష్ణువర్ధన్ రెడ్డిని అదుపులోకి తీసుకుని సుబేదారి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మిగతా నాయకులు, కార్యకర్తలు సంజయ్ రాక కోసం ఎదురుచూస్తూ కోర్టు వద్ద ఉండగా, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్, బీఆర్‌ఎస్ శ్రేణులతో కోర్టు పరిసరాలకు చేరుకున్నారు. రెండు పార్టీల నాయకులు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతోపాటు చేరువగా రావడంతో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు చేరుకుని కోర్టు ప్రహరీలో ఉన్న వారిని బయటకు పంపించారు. తర్వాత మధ్యాహ్నం సమయంలో బీజేపీ రాష్ట్ర నాయకులు జిట్టా బాలకృష్ణారెడ్డి, రాణిరుద్రమ కోర్టు వద్దకు చేరుకున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మీడియాతో మాట్లాడుతుండగా ముందుగా జిట్టా బాలకృష్ణను బలవంతంగా లాక్కెళ్లి పోలీస్ వాహనం ఎక్కించారు. అయితే శాంతియుతంగా ఉండగా ఎందుకు అరెస్టు చేస్తున్నారని రాణి రుద్రమతో పాటు నాయకులు, కార్యకర్తలు పోలీస్ వాహనం ముందు బైఠాయించారు. వీరిని అడ్డుతొలగించే క్రమంలో తోపులాట జరిగి మరోసారి స్వల్ప ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు అదుపులోకి తీసుకుంటున్న క్రమంలో రాణిరుద్రమ చేతికి గాయాలయ్యాయి. వీరిని అదుపులోకి తీసుకుని కొందరిని హసన్‌పర్తి, మరికొందరిని ఎల్కతుర్తి పోలీస్‌స్టేషన్లకు తరలించారు.



బాలకృష్ణారెడ్డి, రాణిరుద్రమను అరెస్ట్ చేస్తున్న పోలీసులు



పోలీసులను వారిస్తున్న బీజేపీ మహిళా కార్యకర్తలు



### రావు పద్మ గృహ నిర్బంధం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ అరెస్టు నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మను హనుమకొండ హంటర్ రోడ్డులోని స్వగృహంలో గృహనిర్బంధం చేశారు.

పాలకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో సంజయ్‌కి వైద్యపరీక్షలు చేస్తుండగా బయట ఆందోళన చేస్తున్న బీజేపీ కార్యకర్తలు




## పాలకుర్తిలో సంజయ్‌కి వైద్యపరీక్షలు

పాలకుర్తి టౌన్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కి బుధవారం జనగామ జిల్లా పాలకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్ లింగమూర్తి నేతృత్వంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, పల్స్ పరీక్షించారు. శరీరంపై గాయాలు ఏమైనా ఉన్నాయా అని పరిశీలించారు. బండి సంజయ్ ఆరోగ్యం నిలకడగా ఉందని, ఎలాంటి గాయాలూ లేవని తెలిపారు. డీసీపీ సీతారాం ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నడుమ జనగామనుంచి పాలకుర్తికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో పీహెచ్‌సీ వద్ద పోలీసులు, బీజేపీ కార్యకర్తలకు తోపులాట జరిగింది. ఎస్కార్ట్ వాహనానికి కార్యకర్తలు అడ్డంగా పడుకున్నారు. పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టి బండి సంజయ్‌ని అక్కడినుంచి తరలించారు.

### ఎన్ని కుట్రలైనా ఛేదిస్తాం
మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

### ‘పిల్లల ఉసురు తగులుతుంది’
మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత

### నీచ రాజకీయాలు
మహబూబాబాద్ ఎమ్మెల్యే శంకర్‌నాయక్

### బీఆర్‌ఎస్ ఆదరణ చూడలేకనే కుట్రలు
వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేష్

- 8లో

## బీఆర్‌ఎస్ నిరసన.. బండి దిష్టిబొమ్మ దహనం

హన్మకొండ: కుట్ర పూరితంగా పదవ తరగతి ప్రశ్నపత్రాలు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సజయ్ కుమార్ లీక్ చేయించారని ఆరోపిస్తూ బుధవారం హనుమకొండలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం కోర్టు ఎదుట బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ ప్రశ్నపత్రాల లీకేజీలతో శాంతిభద్రతల సమస్య సృష్టించి ప్రభుత్వాన్ని అస్థిరపరచాలన్న భారీ కుట్రకు బండి సంజయ్ తెరలేపినందుకు నిరసనగానే ధర్నా చేసి దిష్టిబొమ్మ దహనం చేసినట్లు తెలిపారు. రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేసేందుకు బీజేపీ ఎన్నాళ్లుగానో కుట్ర చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి, కుడా చైర్మన్ సంగం రెడ్డి సుందర్‌రాజ్ యాదవ్, ప్రజా ప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తెలంగాణ అమరవీరుస్తూపం వద్ద బైఠాయించిన చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

### పేపర్‌లీక్, కాపీయింగ్ కుట్ర కేసు నిందితులు
ఏ-1గా బండి సంజయ్

- 8లో

## అధికారుల నిర్లక్ష్యంతోనే ఉత్పత్తికి అంతరాయం



కార్మికులతో మాట్లాడుతున్న శ్రీనివాస్

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి ఏరియాలోని కేటీకే-1వ గనిలో సింగరేణి అధికారుల నిర్లక్ష్యం కారణంగానే బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలుగుతుందని బీఎంఎస్ ఏరియా బ్రాంచ్ ఉపాధ్యక్షుడు అప్పాని శ్రీనివాస్ ఆరోపించారు. ఏరియాలోని కేటీకే 1వ గనిని బుధవారం బీఎంఎస్ నాయకులు సందర్శించి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. బొగ్గు పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులకు 11వ వేజ్ బోర్డులో 19శాతం గ్రాట్యూటి బెనిఫిట్స్‌కు మాత్రమే అంగీకారం కుదిరిందన్నారు. మిగిలిన అన్ని అంశాలపై యాజమాన్యం ఈ నెల 18వ తేదీన కలకత్తాలో జరిగే సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలవెన్స్‌లు, ఇతర సమస్యలపై గత సమావేశాల్లో చర్చించలేదన్నారు. మిగిలిన అంశాలపై త్వరలో జరిగే సమావేశంలో చర్చించకపోతే బీఎంఎస్ ఆధ్వర్యంలో పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. భూపాలపల్లి ఏరియాలోని భూగర్భ గనుల్లో బొగ్గు ఉత్పత్తి సాధించకపోవడానికి అధికారుల నిర్లక్ష్యం ప్రధాన కారణమన్నారు. ఎస్‌డీఎల్ యంత్రాల మరమ్మతులు చేయకపోవడం, విడి భాగాలు అందుబాటులో లేవని తెలిపారు. నూతన పని స్థలాలను సకాలంలో ఏర్పాటు చేయడం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, శ్రీనివాస్, భాస్కర్, లక్‌పతి, ఓదెలు పాల్గొన్నారు.

## బండి సంజయ్ అరెస్టు అప్రజాస్వామికం



కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: బండి సంజయ్‌ను అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. బండి సంజయ్‌ని అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ కీర్తిరెడ్డితో పాటు బీజేపీ శ్రేణులు బుధవారం అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా నిర్వహించి సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కీర్తిరెడ్డి మాట్లాడుతూ పదో తరగతి పేపర్ లీకేజీపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను రాత్రికి రాత్రే అరెస్ట్ చేయడం సరికాదన్నారు. ఈ సందర్భంగా పోలీసులు కీర్తిరెడ్డితో పాటు నాయకులను, కార్యకర్తలను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ ధర్నాలో నాయకులు రామచంద్రా రెడ్డి, విష్ణు, రాంరెడ్డి, రవీందర్, సురేష్, కోరే సుధాకర్, మనోహర్ పాల్గొన్నారు.

## మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ భవేష్ మిశ్రా



చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎస్పీ

భూపాలపల్లిరూరల్: మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని ప్రజలు ముందుకుసాగాలని కలెక్టర్ భవేష్ మిశ్రా కోరారు. సింగరేణి ఇల్లందు క్లబ్‌లో బుధవారం జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించగా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి కలెక్టర్‌తో పాటు, జిల్లా అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాలు అందేలా జగ్జీవన్ రామ్ పాటుపడ్డారని తెలిపారు. దేశ స్వాతంత్ర్యం ఉద్యమంలో కీలకపాత్రం పోషించడంతో పాటు కార్మిక, రక్షణ, వ్యవసాయ శాఖ కేంద్ర మంత్రిగా దేశానికి సేవలందించారని కొనియాడారు. అదే విధంగా జిల్లా కేంద్రంలో సైతం ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజలకు త్వరలోనే భూమి కేటాయింపులు చేస్తామని అందులో మహనీయుల విగ్రహాలు, కమ్యూనిటీ కేంద్రాల నిర్మాణం పనులు చేపట్టుకోవచ్చని తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ దివాకర మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస్, డీఎస్పీ రాములు, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు. అదే విధంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి అదనపు ఎస్పీ శ్రీనివాసులు, పోలీస్ అధికారులతో కలిసి ఎస్పీ సురేందర్‌రెడ్డి నివాళులర్పించారు.

## క్లుప్తంగా

### ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ వాహనం ఎదుట మహిళ ఆత్మహత్యాయత్నం

- డబ్బా తొలగించడంతో మనస్తాపానికి గురైన మహిళ


ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న మహిళను అడ్డుకున్న బీఆర్ఎస్ నాయకులు

కాశిబుగ్గ: వరంగల్ బస్టాండ్ జంక్షన్‌లో డబ్బా (షాపు) తొలగించారంటూ ఓ మహిళ వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ వాహనం ఎదుట కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో అక్కడ ఉన్న బీఆర్ఎస్ నాయకులు ఆమెను అడ్డుకున్నారు. ఈ ఘటన బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. నగరంలోని 35వ డివిజన్ శివనగర్‌కు చెందిన సింగిరెడ్డి కృష్ణవేణి, తండ్రి సుదర్శన్‌లు కొన్నేళ్లుగా వరంగల్ బస్టాండ్ సమీపంలో డబ్బాలు పెట్టుకుని షాపులు నిర్వహించుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. కృష్ణవేణి డబ్బాను కొంతమంది తొలగించడంతో విషయాన్ని స్థానిక కార్పొరేటర్ తెలియజేసింది. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో మనస్తాపానికి గురైన కృష్ణవేణి తనకు న్యాయం జరగడం లేదంటూ బుధవారం శివనగర్ సాయి కన్వెన్షన్ హాల్‌నుంచి బయటకు వస్తున్న ఎమ్మెల్యే నరేందర్ వాహనం ఎదుట నిలబడి ఒంటిపై కిరోసిన్ పోసుకోవడంతో కలకలం రేగింది. అక్కడే ఉన్న బీఆర్ఎస్ కార్యకర్తలు ఆమెను వారించడంతో ప్రమాదం తప్పినట్టైందని స్థానికులు తెలిపారు. మిల్స్‌కాలనీ పోలీసులు ఆమెపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.





# ప్రభుత్వం మారితేనే భూమి, ఇల్లు


అభివాదం చేస్తున్న సీపీఐ జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులు

**గెలిచేరోజు కోసం పోరాడుదాం**

- సీపీఐ పార్లమెంటరీ నేత బినోయ్ విశ్వం
- పేదలకు ఇళ్ల పట్టాలు, ఇల్లు ఇవ్వకపోతే కేసీఆర్‌పై పోరాటం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు
- ముగిసిన ప్రజా పోరుయాత్ర

హన్మకొండ: దేశంలో ప్రభుత్వం మారితేనే పేదలకు భూమి, ఇళ్లు వస్తాయని, ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీని సాగనంపడానికి పోరాడుదామని సీపీఐ పార్లమెంటరీ నాయకుడు బినోయ్ విశ్వం పిలుపునిచ్చారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన విభజన హామీలు నెరవేర్చాలని, ఉమ్మడి వరంగల్ జిల్లా సమగ్రాభివృద్ధికి సీపీఐ చేపట్టిన ప్రజాపోరు యాత్ర ముగింపు బహిరంగ సభ బుధవారం రాత్రి హనుమకొండ బాలసముద్రంలోని కుడా మైదానంలో జరిగింది. ఈ సభలో బినోయ్ విశ్వం ముఖ్య అతిథిగా మాట్లాడుతూ.. ఏదో ఒక రోజు గెలువడం కోసం పోరాడుదామన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా ప్రజల సమస్యలు పరిష్కారం కాలేదని, పేదలకు కూడు, గూడు కల్పించబడలేదని అన్నారు. ప్రజల పక్షాన సీపీఐ పోరాడుతుందని తెలిపారు. దేశంలో బీజేపీ అవినీతి పాలనకు వ్యతిరేకంగా వామపక్ష లౌకిక ప్రజాతంత్ర శక్తులు ఏకమైతే బీజేపీని సాగనంపడం ఖాయమని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో జరుగుతున్న భూ పోరాటాలు చారిత్రాత్మకమని, ఈ పోరాటంలో పేదలు విజయం సాధిస్తారని అన్నారు. రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. సీపీఐ ఎల్లప్పుడూ ప్రజల పక్షమేనన్నారు. పేదలకు ఇల్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వకుంటే పోరాటం తప్పదని అన్నారు. జిల్లాలో పేదలకు ఇళ్ల స్థలాలకు పట్టాలివ్వడానికి సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని, ఇళ్ల స్థలాలకు పట్టాలు, ఇళ్లు ఇవ్వకపోతే కేసీఆర్‌పై పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ప్రశ్న పత్రాల లీకేజీలో బీజేపీ నాయకులు జైలుకు వెళితే తాము ప్రజల కోసం వెళతామన్నారు. బీజేపీ పేదలు, కష్ట జీవుల కోసం ఏనాడూ పనిచేయదని, మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీలనే నెరవేర్చ లేదని దుయ్యబట్టారు. బీజేపీని తరిమికొట్టడం కోసం గొంగళి పురుగు నైనా ముద్దు పెట్టుకుంటామన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా పోరాడే వారితో కలిసి పనిచేస్తామన్నారు. మానవ జాతి ఉన్నంత వరకూ కమ్యూనిస్టులు ఉంటారని అన్నారు. జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ విభజన హామీలు నెరవేర్చకుండా కేంద్ర ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని, బయ్యారం ఉక్కు, కాజీపేట కోచ్, గిరిజన విశ్వవిద్యాలయం వస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ బహిరంగ సభ ప్రజానాట్యమండలి కళాకారుల ఆట పాటలతో హోరెత్తింది. వరంగల్, హనుమకొండ జిల్లా కార్యదర్శులు మేకల రవి, కర్రె భిక్షపతి అధ్యక్షతన జరిగిన ఈ సభలో జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్ పాషా, జాతీయ సమితి సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి, నాయకులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, విజయ సారథి, సీహెచ్ రాజారెడ్డి, కొరిమి రాజ్ కుమార్, తోట మల్లికార్జున రావు, పోతరాజు సారయ్య, నేదునూరి జ్యోతి, రత్నాకర్ రావు, తమ్మెర విశ్వేశ్వరరావు, పంజాల రమేష్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, షేక్ బాష్ మియా, నాయకులు అజయ్, ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, వలీ ఉల్లా ఖాద్రి, మారుపాక అనిల్ కుమార్, నల్లు సుధాకర్ రెడ్డి, జంపాల రవీందర్, అశోక్ స్టాలిన్, సుగుణమ్మ, పల్లె నర్సింహ, పుట్ట లక్ష్మణ్, మణికంఠ రెడ్డి పాల్గొన్నారు.


పాల్గొన్న పార్టీ కార్యకర్తలు, ప్రజలు

## మద్యం తాగొద్దన్నారని వ్యక్తి ఆత్మహత్య

పరకాల: తన ఆరోగ్యం బాగా లేకపోవడంతో పాటు కుటుంబ ఆర్థిక పరిస్థితులు ఇబ్బందిగా ఉంటే మద్యం తాగి రావడం ఏంటని భార్య ప్రశ్నించినందుకు ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పరకాల మున్సిపాలిటీ విలీన గ్రామం సీతారాంపూర్‌లో బుధవారం చోటుచేసుకుంది. పరకాల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సీతారాంపూర్ గ్రామానికి చెందిన అడప రవీందర్ (46) అదే గ్రామంలో భూమిని కౌలుకు తీసుకొని మిర్చి సాగుచేశాడు. వచ్చిన పంట దిగుబడి అమ్మడంతో వచ్చిన డబ్బులను తన ఇష్టమైనట్లు ఖర్చుపెడుతూ మద్యం తాగి ఇంటికి రావడాన్ని గమనించిన భార్య ఒక వైపు తాను ఆరోగ్యం బాగాలేక ఆస్పత్రికి వెళ్లాలనుకుంటే వచ్చిన డబ్బులు తాగి ఖర్చు పెడితే ఎలా అని నిలదీసింది. భార్య మందలించిందనే కోపంతో బయటకు వెళ్లిన రవీందర్ కౌలుకు తీసుకున్న భూమి వద్ద క్రిమిసంహార మందు తాగి తన బంధువులలో ఒకరికి సమాచారం ఇచ్చాడు. సమాచారం అందగానే అక్కడికి చేరుకున్న తిరుపతి అనే వ్యక్తికి అపస్మారకస్థితిలో రవీందర్ కనిపించాడు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. రవీందర్ కుమార్తె నల్లెల అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పరకాల పోలీసులు తెలిపారు.

## ఎంపీపీ కుటుంబానికి చేయూత

- ఎంపీ, ఎమ్మెల్యే రూ.2లక్షల సాయం అందజేత

కురవి: కురవి ఎంపీపీ గుగులోత్ పద్మావతిరవినాయక్ కుటుంబానికి మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత, డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్‌లు రూ.2లక్షల ఆర్థిక సాయాన్ని అందజేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. 'సాక్షి'లో మధ్యాహ్నం పదవి పెద్ద కష్టం


ఎంపీపీకి ఆర్థికసాయం అందజేస్తున్న ఎంపీ కవిత, ఎమ్మెల్యే రెడ్యానాయక్

సాక్షి స్పందన

ఈనెల 2వ తేదీన 'ఉదయం ఎంపీపీగా.. మిరప కూలీగా' అనే శీర్షికన కురవి ఎంపీపీకి న్ని తీసుకొచ్చిందనే కథనాన్ని ప్రచురించిన సంగతి తెలిసిందే. దీనికి స్పందించిన ఎంపీ మాలోత్ కవిత, డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్‌లు చెరో రూ.లక్ష బుధవారం అయ్యగారిపల్లిలో జరిగిన బీఆర్ఎస్ సమ్మేళనంలో అందచేశారు. ఎంపీ, ఎమ్మెల్యేలు సాయం అందచేయడంతో ఎంపీపీ గుగులోత్ పద్మావతిరవినాయక్‌లు కన్నీటిపర్యంతమయ్యారు. ఇదిలా ఉండగా.. సభకు వచ్చిన మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు, నల్లెల్ల సర్పంచ్ ఎర్రంరెడ్డి సుధాకర్‌రెడ్డి రూ.50వేలు, మహబూబాబాద్ ఏఎంసీ డైరెక్టర్ గార్లపాటి భరద్వాజ్‌రెడ్డి రూ.50వేలు, జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు మహబూబ్‌పాషా రూ.10వేలు, బలపాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు నామా సైదులు రూ.10వేలు, అయ్యగారిపల్లి సర్పంచ్ బజ్జూరి జ్యోత్స్నవెంకటరెడ్డి, రూ.5వేలు అందచేశారు. అలాగే కురవి ఆలయ మాజీ చైర్మన్ బాదావత్ రామునాయక్ రూ.50వేలు, బీఆర్ఎస్ జిల్లా పరిశీలకుడు మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ రూ.50వేలు ఎంపీపీ కుటుంబానికి ఇవ్వనున్నట్లు ప్రకటించారు.

## పంచాయతీ కార్యదర్శికి దేహశుద్ధి?

కొత్తగూడ: మండలంలోని పని చేస్తున్న ఓ పంచాయతీ కార్యదర్శికి దేహశుద్ధి చేసిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగు చూసింది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. వేర్వేరు గ్రామాల్లో పని చేస్తున్న ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు మండల కేంద్రం సమీపంలోని ఓ గ్రామంలో ఇళ్లు అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. వారు పని చేస్తున్న గ్రామ పంచాయతీల్లో అవసరాల కోసం వెళ్లే యువతులతో అసభ్యంగా ప్రవర్తించడం, సోషల్ మీడియాలో మెసేజ్‌లు పోస్టు చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. దీంతో ఆ యువతులు తమ తల్లిదండ్రులకు ఈ విషయం తెలపడంతో వారు ఆగ్రహానికి గురై ఒక కార్యదర్శికి దేహశుద్ధి చేసినట్లు తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న మరో కార్యదర్శి తప్పించుకున్నట్లు సమాచారం.

## పేపర్ లీక్, కాపీయింగ్ కుట్ర కేసు నిందితులు

కమలాపూర్‌లో మంగళవారం జరిగిన పదో తరగతి హిందీ పరీక్ష పేపర్ లీక్, కాపీయింగ్ కుట్ర కేసులో పోలీసులు పలువురిని నిందితులుగా చేర్చారు.


వివరాలు వెల్లడిస్తున్న సీపీ ఏవీ. రంగనాథ్

**వారి వివరాలు ఇలా..**

**మొత్తం మంది నిందితులు: 10**

1. బండి సంజయ్(51), రాష్ట్ర అధ్యక్షుడు, బీజేపీ
2. బూర ప్రశాంత్(33), మాజీ జర్నలిస్టు, వరంగల్
3. గుండెబోయిన మహేష్(37), కేఎంసీ ల్యాబ్ అసిస్టెంట్, దేశరాజుపల్లి, కమలాపూర్
4. మైనర్ బాలుడు, కమలాపూర్
5. మౌటం శివ గణేష్ (19), డ్రైవర్, కమలాపూర్
6. పోగుల సుభాష్ (41), డేటా ఎంట్రీ ఆపరేటర్, కమలాపూర్
7. పోగు శశాంక్ అలియాస్ రింకు (16), డిప్లమా, ఫస్టియర్, కమలాపూర్
8. దూలం శ్రీకాంత్ (18), ఇంటర్ పూర్తి, నేరేళ్ల, కమలాపూర్
9. పెరుమాండ్ల శ్రామిక్ అలయాస్ నాని (20), ఐటీఐ విద్యార్థి, వంగపల్లి, కమలాపూర్
10. పోతనబోయిన వర్షిత్ అలియాస్ చందు (19), విద్యార్థి,

**అరెస్టయిన వారు..**

1. బండి సంజయ్(51), రాష్ట్ర అధ్యక్షుడు, బీజేపీ
2. బూర ప్రశాంత్(33), మాజీ జర్నలిస్టు, వరంగల్
3. గుండెబోయిన మహేష్(37), కేఎంసీ ల్యాబ్ అసిస్టెంట్, దేశరాజుపల్లి, కమలాపూర్
4. బాలుడు, కమలాపూర్ (జువైనల్ హోమ్‌కు తరలింపు)
5. మౌటం శివ గణేష్ (19), డ్రైవర్, కమలాపూర్

**పరారీలో ఉన్నవారు...**

6. పోగుల సుభాష్ (41), డేటా ఎంట్రీ ఆపరేటర్, కమలాపూర్
7. పోగు శశాంక్ అలియాస్ రింకు (16), డిప్లమా, ఫస్టియర్, కమలాపూర్
8. దూలం శ్రీకాంత్ (18), ఇంటర్ పూర్తి, నేరేళ్ల, కమలాపూర్
9. పెరుమాండ్ల శ్రామిక్ అలయాస్ నాని (20), ఐటీఐ విద్యార్థి, వంగపల్లి, కమలాపూర్
10. పోతనబోయిన వర్షిత్ అలియాస్ చందు (19), విద్యార్థి,

**నిందితులపై నమోదైన కేసు, సెక్షన్లు ..**

కమలాపూర్ పోలీసులు 4ఏ, 6 రెడ్ విత్ 8 ఆఫ్ తెలంగాణ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ యాక్ట్, 1997, సెక్షన్ 66డి, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటీ) యాక్టులతోపాటు ఐపీసీ 120 బీ, సెక్షన్ 420, 447, 505 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

– సాక్షిప్రతినిధి, వరంగల్



**నాయకుల మాటలు.. మంటలు**

## ఎన్ని కుట్రలైనా ఛేదిస్తాం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

హన్మకొండ: బీజేపీ ఎన్ని కుట్రలు పన్నినా ఛేదిస్తామని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. బుధవారం హనుమకొండలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, నన్నపునేని నరేందర్, అరూరి రమేశ్, దివ్యాంగుల సంస్థ చైర్మన్ వాసుదేవ రెడ్డితో కలిసి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చిల్లర రాజకీయాలకు సీఎం కేసీఆర్ భయపడనన్నారు. ఇలాంటి ఎన్నో కుట్రలు, కుతంత్రాలు, రాజకీయాలను తట్టుకొని చావు నోట్లో తలపెట్టి తెలంగాణ తెచ్చిన కేసీఆర్ తెలంగాణను ఎప్పటికీ కాపాడుతారన్నారు. మా రాష్ట్రాన్ని, మా ప్రజలను, మా ప్రభుత్వాన్ని ఎలా కాపాడుకోవాలో మాకు తెలుసన్నారు. ఒకప్పుడు ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర జరిగిందన్నారు. శ్రీరామ నవమి రోజు మత చిచ్చులు పెట్టి ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్ర చేశారని ఆరోపించారు. వరుసగా జరుగుతున్న ఈ కుట్రలన్నింటినీ సీఎం కేసీఆర్ ఛేదిస్తున్నారన్నారు. పరీక్షలు ఎలా నిర్వహించుకోవాలో.., మా పిల్లలకు ఉద్యోగాలు ఎలా ఇచ్చుకోవాలో.. తెలుసునన్నారు. బీజేపీ ఉద్యోగాలు ఇవ్వదు.. ఇస్తున్న వారికి అడ్డంకులు సృష్టిస్తోందని ఆరోపించారు. ప్రశ్నపత్రాల లీకేజీలో రాజకీయ పార్టీ పాత్ర ఉండటం బాధాకరమని, అందులో బీజేపీ అధ్యక్షుడు, ఆ పార్టీకి చెందిన సంస్థల సభ్యులు ఉండటం అత్యంత హేయనీయమన్నారు. తెలంగాణ పోలీసులు సమర్థులని ఇలాంటి సమస్యలు సులువుగా తేల్చేస్తారన్నారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని, నిందితులు ఎంతటి వారైనా శిక్షిస్తుందన్నారు.

## 'పిల్లల ఉసురు తగులుతుంది'

- మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత

కురవి/మహబూబాబాద్ : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కి బడి పిల్లల(విద్యార్థుల) ఉసురు తగులుతుందని మానుకోట ఎంపీ మాలోత్ కవిత అన్నారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండలంలో నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆమె మాట్లాడారు. టెన్త్ హిందీ పరీక్ష పేపర్ లీకేజీ చేసిన వ్యక్తి బండి సంజయ్‌కి వాట్సాప్ మెసేజ్ చేశాడని, వారికి విద్యార్థుల ఉసురు తగులుతుందన్నారు. కేసీఆర్ ప్రభుత్వాన్ని అభాసుపాలు చేయడానికే చిల్లరమల్లర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు.

**నీచ రాజకీయాలు : ఎమ్మెల్యే శంకర్‌నాయక్**

బీజేపీ నాయకులు నీచ రాజకీయాలు చేస్తున్నారని, పదోతరగతి ప్రశ్నపత్రాలు లీకేజీ చేయడం తగదని మానుకోట ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. మానుకోట జిల్లాకేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

**సూత్రధారుడు బండి సంజయ్ : ఎమ్మెల్యే రాజయ్య**

రఘునాథపల్లి: పదో తరగతి ప్రశ్నాపత్రాల లీకేజీ సూత్రధారుడు ఎంపీ బండి సంజయ్ అని.. బీఆర్ఎస్‌కు ప్రజల ఆదరణ చూసి ఓర్వలేక ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేసేందుకు ఇలా చేశాడని ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఆరోపించారు. బుధవారం జనగామ జిల్లా రఘునాథపల్లి పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చదువు రాని బండి సంజయ్ విద్యార్థుల భవిష్యత్‌ను కాలరాస్తున్నాడని ధ్వజమెత్తారు. టీఎస్‌పీఎస్సీలో రాజశేఖర్‌రెడ్డి, పదో తరగతి పేపర్ లీకేజీలో ప్రశాంత్ ఇలా వారి అనుచరులతో పేపర్ లీకేజీకి పాల్పడ్డాడని విమర్శించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావడానికి ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలు బీఆర్ఎస్ వెంటే ఉంటారన్నారు. ఖబడ్దార్ బండి సంజయ్.. ఇక నీ ఆటలు సాగవంటూ హెచ్చరించారు.

## బీఆర్ఎస్ ఆదరణ చూడలేకనే బీజేపీ కుట్రలు

- బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేష్


మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు అరూరి, పెద్ది, నన్నపునేని

సాక్షి, వరంగల్: బీఆర్ఎస్ పార్టీకి ప్రజల్లో ఉన్న ఆదరణ చూసి ఓర్వలేకనే బీజేపీ నీచ రాజకీయాలకు దిగజారుతోందని, బండి సంజయ్ సూత్రదారిగా రాష్ట్రంలో ప్రశ్న పత్రాల లీకేజీ కుట్ర జరుగుతోందని బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ ఆరోపించారు. పదో తరగతి ప్రశ్న పత్రాల లీకేజీ అంశంపై వరంగల్ నగరం శివనగర్‌లోని ఓ కన్వెన్షన్ హాల్‌లో బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, నన్నపునేని నరేందర్, మేయర్ గుండు సుధారాణి, రైతు రుణ విమోచన సమితి చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లుతో కలిసి అరూరి రమేష్ మాట్లాడారు. 'చదువు విలువ తెలియని సన్నాసుల పార్టీ పన్నిన పన్నాగం పదో తరగతి ప్రశ్న పత్రాల లీకేజీ డ్రామా. మొన్న తాండూరులో తెలుగు ప్రశ్న పత్రం లీకేజీలో ఉపాధ్యాయుడు బండెప్ప బీజేపీ అనుకూల సంఘం నాయకుడు, నిన్న హిందీ పేపర్ లీకేజీలో ఉన్న ప్రశాంత్ బండి సంజయ్ అనుచరుడు. ప్రశాంత్‌ను అరెస్ట్ చేసిన వెంటనే వరంగల్ పోలీస్ కమిషనర్ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు ఆందోళన ఎందుకు చేశార'ని ప్రశ్నించారు. ప్రశ్న పత్రాలు లీక్ అయ్యాయని ప్రచారం చేసి, పరీక్షలు వాయిదా వేయించి ఖాళీగా ఉన్న విద్యార్థులను రాజకీయాలకు వాడుకోవాలని నీచమైన కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. విద్యార్థులు, యువతను అడ్డుపెట్టుకొని రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తున్న బీజేపీ నాయకుల్లారా ఖబర్దార్, ఆ యువతే మీకు సరైన బుద్ధి చెబుతుందన్నారు. ప్రశ్న పత్రాల లీకేజీ విషయంలో నిందితులు ఎవరైనా వదిలే ప్రసక్తే లేదన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఎలాంటి ఆందోళనకు గురికావొద్దని సూచించారు. 'హిందీ పేపర్ లీకేజీ అయిన ప్రాంతం.. ఎంపీగా బండి సంజయ్ ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ లోక్‌సభ స్థానం కిందకు వస్తుంది. ఆ పార్టీ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ ప్రాతినిధ్యం వహిస్తున్న హుజూరాబాద్ నియోజకవర్గం కిందకు వస్తుంది. పేపర్ లీకేజీ వెనుకాల బీజేపీ అనుబంధ సంఘం యువ మోర్చా పని చేస్తుందని ఆరోపించారు. ఎంపీ బండి సంజయ్‌ది ఒరిజినల్ సర్టిఫికెట్ కాద'ని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. అనంతరం వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ.. బండి సంజయ్ 10వ తరగతి కూడా పాస్ అయ్యాడో లేదో ? అని అనుమానం వ్యక్తం చేశారు.

## బీజేపీ నాయకులను విడుదల చేయాలని రాస్తారోకో


హనుమకొండ-కరీంనగర్ రహదారిపై రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు


రాస్తారోకోను అడ్డుకుంటున్న పోలీసులు

ఎల్కతుర్తి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అరెస్టును నిరసిస్తూ బీజేపీ శ్రేణులు నిరసన చేపట్టకుండా ఉండేందుకు వివిధ ప్రాంతాల నుంచి నాయకులను బుధవారం అరెస్టు చేసి ఎల్కతుర్తి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రాత్రి 8 గంటలు దాటినా వారిని విడుదల చేయడం లేదని బీజేపీ నాయకులు పోలీస్‌స్టేషన్‌కు పెద్ద ఎత్తున చేరుకున్నారు. అరెస్టు చేసిన నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు వినకపోవడంతో హనుమకొండ– కరీంనగర్ ప్రధాన రహదారిపై బీజేపీ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. పోలీసులు వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ వారు వినకపోవడంతో పోలీస్‌స్టేషన్ ఎదుట కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. మహిళా నాయకులు ఉన్నారని చూడకుండా రాత్రి వరకు విడుదల చేయకుండా ఉండడాన్ని నాయకులు తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చివరకు పోలీసులు అరెస్టు చేసిన బీజేపీ నాయకులను విడుదల చేయడంతో ఆందోళన సద్దుమణిగింది. ఇరువైపులా నిలిచిపోయిన వాహనాలను క్లియర్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ, రాష్ట్ర నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బండి సాంబయ్యయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

**పోలీసుల అదుపులో బీజేపీ రాష్ట్ర నాయకులు**


హసన్‌పర్తి: పోలీసుల అదుపులో బీజేపీ నాయకులు

హసన్‌పర్తి: బీజేపీ రాష్ట్ర నాయకులను పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకుని హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను అరెస్ట్ చేసి హనుమకొండలోని కోర్టుకు తరలించిన నేపథ్యంలో హైదరాబాద్‌తో సహా ఇతర ప్రాంతాలకు చెందిన బీజేపీ నాయకులు భారీగా హనుమకొండకు తరలివచ్చారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుచ్చిరాములు, సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి, మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి శ్యామల, గీతారామ్, రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి కేశిరెడ్డి పద్మారెడ్డి, రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యురాలు చల్లా గీత, మేడ్చల్ మహిళా అధికార ప్రతినిధి త్రివేణి, హైందవిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈమేరకు వారిని హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో స్థానిక కార్పొరేటర్ శివకుమార్ పరామర్శించారు.